వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
మంగళవారం, 19 మార్చి, 2024



## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఎస్పీ రోహిత్ రాజు

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మార్చి18) జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.మద్యం సేవించి వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురయ్యి చాలామంది ప్రాణాలను కోల్పోతున్నారు.మరి కొంతమంది విగత జీవులుగా మారుతున్నారు.రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగానే జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ పరీక్షలను నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా ఎస్పీ వెల్లడించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన వారికి ఇకనుండి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.ఇకపై జిల్లా వ్యాప్తంగా నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## బైక్ ఢీ కొట్టి తో వ్యక్తి మృతి

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా మార్చి 18: హన్వాడ మండలం పరిధిలో ఉన్న నాయినోని పల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాయినోనిపల్లి గ్రామానికి చెందిన సెంచు సత్తయ్య (50) హన్వాడ నుంచి నాయినోని పల్లికి నడుచుకుంటూ వెళుతుండగా దారిలో వెనకనుంచి అదే గ్రామానికి చెందిన వ్యక్తి బైక్ ఢీకొట్టడంతో తలకు బలంగా గాయాలు తలగడంతో చికిత్స కోసం మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా దారిలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హన్వాడ పోలీసులు తెలిపారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆకస్మిక తనిఖీ

### జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయం

సిద్దిపేట, మార్చి 18 (వాయిస్ టుడే బ్యూరో ప్రతినిధి) జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ఈరోజు జిల్లాలోని ములుగు, నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగింది. ముందుగా ములుగు, నారాయణరావుపేట ప్రాథమిక కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను, పరిశీలించి, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సమయపాలన పాటించాలని, అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో 100% పూర్తయ్యేటట్లు ప్రణాళికలు రూపొందించుకొని నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కార్య కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ,ఆరోగ్య కార్యక్రమాల పైన ముఖ్యంగా గర్భిణి స్త్రీల నమోదు, (ఐ ఎఫ్ ఏ)టాబ్లెట్ల వినియోగం, బాలింతల గృహ సందర్శన, పోషకాహారం, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు . డిఎంహెచ్ఓ తో పాటు డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

## అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధన తప్పకుండా పాటించాలి

### – జిల్లా కలెక్టర్ మను చౌదరి



సిద్దిపేట, 18 మార్చ్ (వాయిస్ టుడే బ్యూరో ప్రతినిధి) అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం. మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా లోక్ సభా ఎన్నికలకు షెడ్యూల్ ని ప్రకటించినందున ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ అనుమతులకు సంబంధించి సువిధ ఆప్ లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు నేరుగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. పోస్టర్లు, పాంప్లెంట్లను ముద్రించేటప్పుడు వాటి మీద ప్రింటర్స్ అడ్రస్ కూడా కచ్చితంగా ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై నిగా ఉంచేందుకు కలెక్టర్ కార్యాలయంలో ఒక ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని సి విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్, నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ వింగ్, ఎంసీఎంసీ తదితర వింగ్స్ ఉంటాయని అన్నారు. ఈసారి 85 సంవత్సరాల పైబడిన వారికి హోమ్ ఓటింగ్ అవకాశం ఉంటుందని తెలిపారు. ఈవీఎంలు మరియు పోలింగ్ పర్సన్స్ ర్యాండమేజేషన్లో పొలిటికల్ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు జి. మోహన్ లాల్ (బిఆర్ఎస్), శ్రీనివాసరెడ్డి (బిజెపి), ఎండి ఎండి.ఇమాముద్దీన్, ఎండి.గయాసుద్దీన్ (కాంగ్రెస్), ఎండి.మునీర్, ఏఐఎంఐఎం, రవికుమార్, ప్రశాంత్ సిపిఐ(ఎం), ఎలక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఎలక్షన్ డిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుక మల్లు స్వరాజ్యం వర్ధంతి నేడే

(మార్చి 19న ద్వితీయ వర్ధంతి)

**సేకరణ:**
**ఏనుగుల వీరాంజనేయులు సీనియర్ జర్నలిస్ట్**



తెలంగాణలోని హైద్రాబాద్ సంస్థానంలో ఫ్యూడల్ వ్యవస్థ మీద,జాగీర్దార్ మీద,రజాకార్ల రాక్షసత్వం మీద,ఆ తర్వాత భారత సైన్యం మీద, తెలంగాణలోని అసంఖ్యాకమైన స్త్రీలు – పురుషులు చేసిన తిరుగుబాటు చారిత్రాత్మకం. అదే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం,నిజాం సంస్థానంలో కనీస పౌర హక్కులు లేవు,విద్యా,వైద్య అవకాశాలు శూన్యం,ప్రజలకు ప్రాణ రక్షణ లేదు, రైతుల మీద మోయలేని పన్నుల భారం,సౌకర్యాలు శూన్యం,మధ్య యుగాలనాటి ఫ్యూడల్ అణిచివేత విధానం, లేవీ ధాన్యం వసూళ్ళు సాంఘిక,ఆర్థిక దోపిడి,ఈ ఫ్యూడల్ రాచరిక రాజ్యంలో నైజాం.నవాబు పరిపాలనలో ఎన్ని దురాఘతాలు ఎన్నోన్నో దుర్మార్గాలు స్వేచ్ఛా వాయువు లేని చీకటి రాజ్యం,కుల అణిచివేత,వెట్టిచాకిరీ,బానిస యుగాల నాటి దుర్మార్గమైనటు వంటి దోపిడీ పాలన కొనసాగు తున్నటువంటి రోజులవి.చిరుప్రాయంలో బంధూకు చేతబట్టి భూస్వాములను నైజాం రజాకార్లను తరిమికొట్టిన వీరవనిత విప్లవ ధృవతార కామ్రేడ్ మల్లు స్వరాజ్యం.ఆమె (ఉమ్మడి నల్లగొండ జిల్లా) సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కరివిరాల కొత్తగూడెం గ్రామంలో

ఓ భూస్వామ్య కుటుంబంలో 1931లో భీంరెడ్డి రాంరెడ్డి చుక్కమ్మలకు జన్మించారు. "పువ్వు పుట్టగానే పరిమళించు" అన్నట్లు ఆమె చిన్ననాడే పోరాట పంథాను ఎంచుకున్నారు.11 సం?రాల వయస్సులో ఆమె తండ్రి చనిపోయాడు.అక్క శశికళ కూడా పోరాటంలో 3 సం?రాలు జైలు జీవితం గడిపారు.స్వరాజ్యం తల్లి చుక్కమ్మ గొప్ప సామ్యవాది.తన కుటుంబం అంతా నేటికి విప్లవ రాజకీయాలతో పెనవేసుకొని ఉన్నది.నాడు చెక్క పలకలపై ఇసుకలో ఓనమాలు దిద్దుకొని క్రమంగా 5వ తరగతి వరకు విద్యను అభ్యసించారు. చిన్నతనంలో కమ్యూనిస్టు భావాలు అలవర్చుకొని దోపిడీకి వ్యతిరేకంగా,తన సొంత గ్రామంలో గ్రామ పటేళ్ళను,పెత్తందార్లను ఎదిరించి పాలేర్ల సంఘం పెట్టి కూలిరేట్ల ఉద్యమంతో ప్రారంభమైన ఆమె విప్లవ జీవితం 8 దశాబ్దాల పాటు ఏనాడు వెనుదిరగలేదు. విప్లవమే జీవితంగా భావించి ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా ఆమె పోరాటాలకు తట్టుకోలేక సొంత ఇంటిని ధ్వంసం చేసినా, స్వరాజ్యంను పట్టుకుంటే నాటి ప్రభుత్వం బహుమతులు కూడా ప్రకటించినా మొక్కవోని ధైర్యంతో తన అన్న భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి (బి.యన్.) అడుగు జాడల్లో పోరాటాల్లోకి వచ్చిన స్వరాజ్యం ఏనాడు మడమ తిప్పలేదు.పోరాటమే ఆయుధంగా గెరిల్లా దళాల్లో చేరి దొరల దుర్మార్గాలను ఎదుర్కొంటూ నైజాం రజాకార్ల పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన వీరవనిత మల్లు స్వరాజ్యం,విప్లవోద్యమంలో తనదైన ముద్ర వేసుకొని అలుపెరగని పోరాట యోధురాలుగా "ఆమె మాటే తుపాకి తూటాల" తనదైన పాత్ర పోషించిన ఆమె పోరాటం చిరస్మరణీయం.ఆ పోరాట ఘట్టాలు నాటికి,నేటికి ఎప్పటికి ప్రజల మదిలో స్ఫురిస్తూనే ఉంటాయి.

తెలంగాణలో భూమికోసం, భుక్తికోసం,వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె ముఖ్య భూమిక పోషించారు.తెలంగాణలో వెట్టిచాకిరి రద్దు చేయాలని,దున్నేవానికి భూమి కావాలని,నైజాం నవాబు గద్దె దిగాలనే నినాదాలతో సాగిన మహత్తర సాయుధ పోరాటం,ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ దగిన పోరాటం.ఆ సాయుధ పోరాట ఫలితంగా

తెలంగాణలో 3వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి.4 వేల మంది వీరమరణం పొందారు.10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడింది.భూస్వాముల భూములు,గఢీలు ప్రజల స్వాధీనమైనవి.వెట్టిచాకిరీ రద్దయింది.వడ్డీ వ్యాపారం అక్రమ భేదాఖళ్ళు నిలిపి వేయబడ్డాయి.వ్యవసాయ కూలిరేట్లు పెంచ బడ్డాయి.గ్రామాలను గ్రామ రైతు కమిటీలు పరిపాలించారు.నైజాం రజాకార్ల బారి నుండి రైతాంగాన్ని రక్షించుకొనేందుకు 10 వేల మంది గ్రామరక్షక దళాలు 2 వేల మంది గెరిల్లా సాయుధ దళాలు నిర్మించారు. ఫలితంగా సాగిన పోరాటంలో మధ్యయుగాల నాటి నైజాం నవాబు పాలన అంతమొందింది.

కమ్యూనిస్టుల నాయకత్వాన సాగిన సాయుధ రైతాంగ పోరాటం అనేక విజయాలు సాధించింది.ఫలితంగా దేశవ్యాప్తంగా భూసంస్కరణ చట్టం వచ్చింది,కౌలుదారి చట్టం వచ్చింది,పౌర హక్కులు వచ్చాయి,ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వచ్చాయి.ఈ చారిత్రక పోరాటంలో స్వరాజ్యం పాత్ర అద్వితీయం అజరామం.

ఎర్రజెండానే ఊపిరిగా, పోరాటమే ఆయుధంగా 1945, 1948 సంవత్సరాలలో సాగిన వీరోచిత రైతాంగ పోరాటంలో ఆమె కీలక పాత్ర పోషించారు. నైజాం సర్కారును గడగడ లాడించిన ధీశాలి కా?మల్లు స్వరాజ్యం .ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్,వరంగల్ జిల్లాల్లో దళ కమాండర్ గా పనిచేసారు.గోదావరి అడవుల్లో 3 సం?రాల పాటు పనిచేసారు.ఆమె మొదట జోన్ కార్యకర్తగా ఆ తర్వాత ప్రాంతీయ కమిటీ సభ్యురాలుగా,గుండాల కేంద్రంలో కోయలను ఉత్తేజ పరిచి వారికి నాయకత్వం వహించి పోరాటాలలోకి దింపింది స్వరాజ్యం గారు. భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినప్పటికీ అణగారిన వర్గాల్లోకి,వ్యవసాయ కార్మికుల్లోకి చొచ్చుకొని పోయి వారిలో ఒకరిగా ప్రజలతో మమేకమయ్యే లక్షణం కలిగి ఉండేది.తదనంతరం మార్క్సిస్టు పార్టీ ఉద్యమంలో కీలకమైన బాధ్యత నిర్వహిస్తు తుంగతుర్తి శాసన

సభ్యురాలిగా,పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా,మహిళా సంఘం ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనేక పోరాటల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు ఆమె మాటే తుపాకీ తూటా మల్లు స్వరాజ్యం వ్యక్తి కాదు ఆమె ఒక మహాశక్తి,ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మార్క్సిస్టు పార్టీ ఉద్యమానికి అండదండలు ఇచ్చి, కార్యకర్తలను అక్కున చేర్చుకొని కాపాడటంలో ఎనలేని కృషి చేసారు.

మార్క్సిస్టు పార్టీ ఉద్యమంపై, కార్యకర్తలపై నాడు పాలకపార్టీ గుండాలు హత్యల పరంపర కొనసాగుతున్న రోజుల్లో మండే కొలిమిలా మార్క్సిస్టు ఉద్యమంపై దాడులు జరుగుతున్నప్పుడు కార్యకర్తలకు అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చిన ఘనత కాబి.యన్.,కాస్వరాజ్యం పాత్ర వెలకట్ట లేనిది.

మిర్యాలగూడెం ప్రాంతంలో రాగిరెడ్డి వీరారెడ్డి,గాదె శ్రీనివాసరెడ్డి,పొనుగోడులో అందె నర్సయ్య,సుందరి బసవయ్య,మల్లారెడ్డిగూడెం కందుల గుర్వారెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి,యాతవాకిళ్ళలో పున్నంరాజు,మునగాలలో ముదిరెడ్డి ఆదిరెడ్డి, సూర్యాపేటలో ధనియాకుల గుర్వయ్య హత్యలతో పాటు సూర్యాపేట,తుంగతుర్తి, పుట్టపాక లాంటి అనేక గ్రామాల్లో,ఉద్యమ కేంద్రాల పైన దాడులు జరిగినప్పుడు ఆ కేంద్రాలకు అండనిచ్చి వారి కుటుంబాలకు మనోధైర్యాలను నింపటంలో ఆమె నిర్వహించిన పాత్ర అద్వితీయం.

పాలకపార్టీల అండతో పోలీసులు ఉద్యమ కేంద్రాలపై దాడులు చేసినప్పుడు,పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి,చిత్రహింసలకు గురిచేసినప్పుడల్లా ఆమె గళమెత్తితే పాలక వర్గాలకు, పోలీసులకు లాగు తడిచేది. స్వరాజ్యం ఏ సభలో పాల్గొన్నా,ఆమె ప్రసంగం కోసం ప్రజలు గంటల తరబడి ఎదురు చూసేవారు,కేరింతలు కొట్టేవారు.

**జిల్లా అభివృద్ధిలో స్వరాజ్యం పాత్ర కీలకం:** ఉమ్మడి నల్లగొండ జిల్లాను సమగ్రా అభివృద్ధి చేయాలని సాగు,త్రాగునీరు,ఫ్లోరైడ్ నివారణ కోసం నిరంతరం ఆమె గళాన్ని శాసనసభలో ప్రజాపోరాటాల్లో తన వాణిని వినిపించేది.1978లో, 1983లో రెండు పర్యాయాలు తుంగతుర్తి ఎం.ఎల్.ఏ.గా గెలిచి తుంగతుర్తితో పాటు జిల్లా సమగ్ర అభివృద్ధికై పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఆమెది.తుంగతుర్తి ప్రాంతానికి యస్.ఆర్.ఎస్.పి. సమరశీల పోరాటాల ద్వారా సాగు,త్రాగు నీటి కోసం నిరంతరం పోరాటం చేసి విజయం సాధించిన ఘనత కమ్యూనిస్టులదే.తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో జూనియర్ కళాశాలతో పాటు,రోడ్లు,విద్య,వైద్యం సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి అభివృద్ధి ప్రధాతగా పేరు తెచ్చుకున్నారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శ్రీశైల సొరంగ మార్గం నుండి ఏ.యం.ఆర్.పి.ప్రాజెక్టు ద్వారా హైద్రాబాద్ త్రాగునీరు, నల్లగొండ జిల్లాకు సాగు, త్రాగునీరు శాశ్వత పరిష్కారం సాధించిన ఘనత కమ్యూనిస్టులదే,జిల్లా అభివృద్ధిలోను,ప్రజా పోరాటాల్లోను మల్లు వెంకట నర్సింహ్మారెడ్డి, బి.యన్.,స్వరాజ్యం జిల్లా అభివృద్ధిపై చెరగని ముద్ర వేశారు.

ఆమె జీవితం అంతా పోరాటాల మయం,ఆమె త్యాగం వెలకట్ట లేనిది,ఆమె చరిత్ర విప్లవోద్యమాలకు పూలబాట,ఆమె పరిపూర్ణమైన విప్లవ జీవితం గడిపారు.

భూస్వామ్య వర్గంలో పుట్టినా పీడిత వర్గాలకోసం తుదిశ్వాస వరకు పనిచేసారు.ప్రతినిత్యం పీడితుల కోసం గలమెత్తి నినదించేవారు.ఆమె గొప్ప ఆదర్శ కమ్యూనిస్టు,ఆమె నిరాడంబరత నేటి తరానికి ఆదర్శం.ఎన్నో కుటుంబాలు ఆమె పేరును తమ పిల్లలకు నామకరణం చేసుకున్నారు.

ఆమె చరిత్ర పాఠ్యపుస్తకాల్లో లిఖించబడ్డది.తెలంగాణలో ప్రజారాజ్య స్థాపనే ఆమె లక్ష్యం,ప్రజా పోరాటాలను నిర్మిద్దాం – మల్లు స్వరాజ్యం ఆశయాలను సాధిద్దాం.

ఇదే ఆమెకు మనమిచ్చే ఘనమైన నివాళి.తేదీ 19, మార్చి 2024 న ప్రజాఉద్యమాల కేంద్రమైన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూర్యాపేట పట్టణ పరిధిలోని మల్లు స్వరాజ్యం స్వగ్రామమైన రాయినిగూడెం గ్రామంలో ద్వితీయ వర్ధంతి సభ జరుగుతున్నది.ఈ సభకు అధిక సంఖ్యలో ప్రజలు. పాల్గొనాలని విజ్ఞప్తి... మత తత్వ రాజకీయాలు ఓడిద్దాం ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం స్వరాజ్యం ఆశయ సాధన కోసం మనందరం పునరంకిత మవుదాం, ఇవే స్వరాజ్యంకి విప్లవ జేజేలు.



ఏనుగుల వీరాంజనేయులు
తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు

## మొదలైన న్యాయ వాదుల నామినేషన్ పర్వం



కరీంనగర్ : జిల్లాలోని అతి పెద్ద న్యాయవాదుల సంఘమైన కరీంనగర్ బార్ అసోసియేషన్ కు ఈనెల 28 న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు తెలిపారు. ఈరోజు నుండి బుధవారం వరకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు, ఈనెల 21 న నామినేషన్ల పరిశీలన, 22 న నామినేషన్ల ఉపసంహరణ, 28 న పోలింగ్, అదే రోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలను విడుదల చేస్తామని తెలిపారు. బార్ కౌన్సిల్ లెక్క ప్రకారం 1030 మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వేసే అవకాశం ఉందని అన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డికి ప్రిన్సిపల్ సునీతా వినతి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో నాలుగు రూమ్స్ లలో 300 మంది డిగ్రీ విద్యార్థులతో కళాశాల నడుపుతున్నామని గత ప్రభుత్వం లోనే డిగ్రీ కళాశాల మంజూరు అయింది,స్తలం లేకపోవటం తో పెండింగ్ లో ఉంది,కొత్తగా డిగ్రీ కళాశాలను ఎర్పాటు చేయాలని ఎమ్మెల్యే కి వినతి పత్రం అందచేశారు. ఉప్పల్ భాగాయత్ లో ప్రభుత్వ స్తలం 6 ఎకరాలలో స్తలం తో పాటుగా బిల్డింగ్ నిర్మాణం చెప్పట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కి తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గతం లో ఇచ్చిన హామీ ప్రకారంగా ఉప్పల్ లో డిగ్రీ కలశాల ఎర్పాటు తప్పకుండ ప్రయత్నం చేస్తామని ,మంజూరైన కళాశాలకు విద్య శాఖ మంత్రి తో మాట్లాడి త్వరలోనే కాళాశాల నిర్మాణం జరిగేలా చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరపతి,ప్రిన్సిపల్ డాక్టర్ సునీతా, ఆలాగే హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్,బిఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు ,సురం శంకర్,సాలార్ పాల్గోన్నారు.

## జిల్లాలో పదవ తరగతి పరీక్షల కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



సిద్దిపేట, 18 మార్చి (వాయిస్ టుడే బ్యూరో ప్రతినిధి) సిద్దిపేట పట్టణంలోని గవర్నమెంట్ హై స్కూల్ ( మల్టీ పర్పస్) మరియు ఇందిరా నగర్ జడ్పీ హైస్కూల్ లలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి. సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాగా ఉదయం 10:30 గంటల సమయంలో జిల్లా కలెక్టర్ సిద్దిపేట పట్టణంలోని గవర్నమెంట్ హై స్కూల్ (మల్టీ పర్పస్), మరియు ఇందిరానగర్ జిల్లా పరిషత్ హై స్కూల్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును, పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసిన వసతులను, సెక్యూరిటీని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటిండెంట్ లను ఆదేశించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల సమీపంలో ప్రజల గుమి కాకుండా చూసుకోవాలని, ఏదన్న ఇబ్బంది కలిగితే పోలీస్ కు సమాచారం అందించాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షల నిర్వహించాలని, ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీస్ ఎస్కార్ట్ తో నిర్వహించాలని అన్నారు. త్రాగునీరు మరుగుదొడ్లు సౌకర్యం తప్పనిసరిగా ఉండాలని, ఎండాకాలం కాబట్టి విద్యార్థులకు అందుబాటులో ఓఆర్ఎస్ తోపాటు అవసరమైన మందులతో వైద్య శిబిరం తప్పక అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.